క్లుప్తంగా

అమ్మవార్లకు కుంకుమ పూజలు


కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

కాళ్ల: మండలంలోని బొండాడ గ్రామ దేవతలు పోలేరమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల 50వ వార్షిక జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలయ ప్రాంగణంలో శుక్రవారం అమ్మవార్లకు మందపాటి వెంకటేశ్వరరావు, సత్యవతి దంపతులచే లక్ష పుష్పార్చన, పంచామృత అభిషేకాలు, మహిళలచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఈఓ ఆంజనేయరాజు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వేణుగోపాల స్వామికి పుష్పార్చన


పుష్పాలంకరణలో వేణుగోపాలస్వామి

భీమవరం (ప్రకాశంచౌక్): బంట్రోతు వారి వీధిలోని వేణుగోపాల స్వామి ఆలయంలో కృష్ణునికి విశేష పుష్పార్చన నిర్వహించారు. శుక్రవారం హోళీ పౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు కొమ్ము శ్రీనివాస్‌చే ప్రత్యేక పూజలు, మల్లెపూలు, కనకాంబరాలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

వైభవంగా పుష్పయాగోత్సవం


అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

వీరవాసరం: తోకలపూడిలో వేంచేసియున్న భూదేవి సమేత వేంటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుష్పయాగోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వార్లకు చక్రస్నానాలు చేయించారు. ప్రత్యేక హోమాలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. సుమారు 15000 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారని నిర్వాహకులు తెలిపారు. ఆలయ నిర్మాత గంధం వెంకటస్వామి నాయుడు, గంధం నాగబాబు, గంధం కేసు బాబు, గంధం సూరిబాబు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల సంబరాలు


గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఆకివీడు: స్థానిక మాదివాడ గ్రామ దేవతలు మద్దిరావమ్మ, గంగానమ్మ అమ్మవార్ల వార్షిక సంబరాలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవార్లకు స్థానిక ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన ఎడ్ల బండిలో ఊరేగించారు. గ్రామ పుర వీధుల్లో మహిళలు అమ్మవార్లకు బిందెలతో నీళ్లు పోసి స్వాగతం పలికి నైవేద్యాలు సమర్పించుకున్నారు.

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మకు పరామర్శ

భీమవరం: ఢిల్లీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖామంత్రి వై.సత్యకుమార్‌యాదవ్, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు పరామర్శించారు. పాక వెంకట సత్యనారాయణ, కనుమూరి భరత్, ఐనంపూడి శ్రీదేవి, పేరిచర్ల సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

పండితుల ఆశీర్వాదాలు

పాలకోడేరు: కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మకు వాహన ప్రమాదం జరిగి క్షేమంగా తిరిగి రావడంతో మండలంలోని గొల్లలకోడేరు గ్రామానికి చెందిన దర్భా అచ్యుతరామ సిద్ధాంతి, మెట్ల గోపాలశర్మ శుక్రవారం హోళి కా పూర్ణిమ సందర్భంగా అమ్మవార్లకు చండీహోమం నిర్వహించి శ్రీనివాసవర్మకు అందజేశారు.

త్వరలో క్రిటికల్ కేర్ ఆసుపత్రికి శంకుస్థాపన

భీమవరం: భీమవరంలో క్రిటికల్ కేర్ ఆసుపత్రికి త్వరలో శంకుస్థాపన చేసి వేగంగా పూర్తి చేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ చెప్పారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పాలకోడేరు: ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో జరుగుతున్న అభివృద్ధి పనులను డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు శుక్రవారం పరిశీలించారు. ముందుగా పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతి దేవి విగ్రహానికి పూలమాలవేసి వందన సమర్పణ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

సౌకర్యాలు ఉన్నా.. ప్రయోజనం సున్నా

- నిరుపయోగంగా చేపల మార్కెట్ భవనం
- గత ప్రభుత్వంలో రూ.2 కోట్లతో నిర్మించిన భవనం
- భవనంలో చేపల విక్రయాలకు సౌకర్యాల కల్పన
- వినియోగంలోకి తేవాలంటున్న చేపల వ్యాపారులు
- పట్టించుకోని మత్స్యశాఖ అధికారులు



నిరుపయోగంగా ఉన్న మార్కెట్ భవనం


యనమదుర్రు డ్రెయిన్‌పై గొడుగుల నీడలో చేపలు అమ్ముతున్న వ్యాపారులు

భీమవరం(ప్రకాశం చౌక్): మార్కెట్‌లో చేపల అమ్మకాలు చేసుకునే వారికి ఎండ, వాన నుంచి రక్షణగా ఉండడటానికి అలాగే చేపల విక్రయాలకు అనుకూలంగా ఉండేందుకు సకల సౌకర్యాలతో గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రూ.2 కోట్లతో బుధవారం మార్కెట్‌లో నూతన అధునాతన చేపల మార్కెట్ భవనాన్ని నిర్మించింది. ఈ భవనాన్ని గత ఏడాది డిసెంబర్‌లో ప్రారంభించారు. ఈ భవనంలో 45 దుకాణాల వరకు ఏర్పాటు చేసుకుని చేపల విక్రయాలు, వాటిని చేసి వినియోగదారులకు ఇచ్చేలా సౌకర్యాలు సమకూర్చారు. అలాగే వ్యాపారాలకు ఇబ్బందులు లేకుండా ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యం, టాయిలెట్స్ సౌకర్యంతో భవనాన్ని నిర్మించడంతో చేపల వ్యాపారులు ఎంతో సంతోషపడ్డారు. వారికి భవనంలో వ్యాపారం చేసుకునే భాగ్యం ఇప్పటికీ కలగలేదు.

అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగం

గత ఏడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు 15 నెలలుగా ఈ భవనం అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా ఉంది. దీంతో చేపల వ్యాపారులు బుధవారం మార్కెట్‌లో అధ్వానంగా ఉన్న షెడ్డులోనే చేపలు విక్రయిస్తున్నారు. మరి కొందరు గంగానమ్మ గుడి వద్ద యనమదుర్రు డ్రెయిన్ గట్టుపై గొడుగుల నీడల్లో చేపల విక్రయాలు చేస్తున్నారు. దీంతో ఎండ, వానకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవనంలోనే దుకాణాలు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

కలెక్టర్, జేసీ స్పందించాలి

ప్రజా ధనంతో సుమారు రూ.2 కోట్లతో నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉండడంపై జిల్లా కలెక్టర్, భీమవరం మున్సిపాలిటి ప్రత్యేక అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ స్పందించి ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలి. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని చేపల వ్యాపారాలు కోరుతున్నారు. భవనంలో చేపలు విక్రయిస్తే బహిరంగ ప్రదేశాల్లో చేపల విక్రయాలు తగ్గి పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుంది.

నిరుపయోగంగా భవనం



బుధవారం మార్కెట్‌లో నూతనంగా నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉంది. 42 దుకాణాలు వస్తేనే భవనంలో వ్యాపారాలకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఉన్నత అధికారులు స్పందించి ఈ భవనంలో చేపలు అమ్ముకునేలా చేస్తే మా ఇబ్బందులు తీరుతాయి.

–బి.వెంకటలక్ష్మి, చేపల వ్యాపారి, భీమవరం

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



నూతనంగా కట్టిన భవనంలో చేపలు అమ్ముకునే అవకాశం లేకపోవడంతో మార్కెట్‌లో అధ్వానంగా ఉన్న షెడ్డులో ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వస్తే అంతా బురదగా ఉంటుంది. దోమలు, పురుగులతో అపరిశుభ్రంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మున్సిపల్ అధికారులు కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదు. ఇక్కడ పరిస్థితి చూసి చేపలు కొనుగోళ్లు చేయడానికి జనం కూడా రావడం లేదు. –ఇ.లక్ష్మి, చేపల వ్యాపారి, భీమవరం

ఘనంగా స్పోర్ట్స్ డే వేడుకలు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

భీమవరం: విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో చదువులలోనూ, క్రీడల్లోనూ రాణిస్తేనే ఉన్నత శిఖరాలు అందుకోగలరని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్‌వర్మ అన్నారు. శుక్రవారం కళాశాలలో స్పోర్ట్స్ డే సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి.సత్యనారాయణరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారని ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి కళాశాల యాజమాన్యం ప్రత్యేక జ్ఞాపికలు అందిస్తున్నట్లు చెప్పారు. రామకృష్ణ నిషాంత్‌వర్మ, ఎం.జగపతిరాజు, గోకరాజు రామరాజు, కేవీ మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.

కారల్‌మార్క్స్‌కు ఘన నివాళి

భీమవరం: రష్యన్ విప్లవ ప్రభావం భారతదేశంలో జాతీయ ఉద్యమంపై ఎంతో ప్రభావం చూపించిందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెటి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు. శుక్రవారం కారల్‌మార్క్స్ 141వ వర్ధంతిని నిర్వహించారు. కారల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. న్యాయవాది మల్లుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదల కాలనీలపై కూటమి కన్నెర్ర


సీపీఎం నాయకులకు వినతిపత్రం అందిస్తున్న జగనన్న కాలనీవాసులు

ఉండి: గత ప్రభుత్వం నిరుపేదలకు మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ మండిపడ్డారు. శుక్రవారం మండలంలోని మహదేవపట్నం, ఉండి, ఎన్నార్పీ అగ్రహారం గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో సైకిల్ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా జనన్న కాలనీ వాసులు సీపీఎం నాయకుల దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు. గోపాలన్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే కూటమి సర్కారు ఆ కాలనీల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్నారు. కాలనీకి మౌలిక వసతులు కల్పించాలంటూ ఈవోపీఆర్డీ సీహెచ్‌వీఎస్ రెడ్డితో మాట్లాడినట్లు తెలిపారు. లేకుంటే ఈ నెల 17వ తేదీన కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామని జగనన్న కాలనీ వాసులు ఈ నిరసనలో పాల్గొనాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బురిడి వాసుదేవరావు,క్రాంతిబాబు, మునుకోలు వైకుంఠరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పేదోడిపై రఘురామకృష్ణరాజు ప్రతాపం

పేదోడిపై ప్రతాపం, ధనవంతుడిపై ప్రేమ కురిపిస్తున్న ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజుకు పారిశ్రామిక వేత్త రంగరాజు ఆక్రమణలు కనబడట్లేదా అని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ మండిపడ్డారు. అనంతరం బురిడి వాసుదేవరావు మాట్లాడుతూ 1987లో జాతీయ రహదారిని ఆనుకుని బీసీ కాలనీ ఏర్పడిందన్నారు. జాతీయ రహదారికి వెళ్లేందుకు 60 అడుగుల రహదారి అవసరం కాగా రంగరాజు ఆక్రమణలతో కేవలం 8 అడుగుల రహదారి మాత్రమే ఇస్తానని చెబుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. బడాబాబులకు అండగా నిలిచి చిరు వ్యాపారులపై ప్రతాపం చూపిస్తున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ప్రజా సంఘాల నాయకుడు రాము హెచ్చరించారు.

పేదల కాలనీపై ప్రభుత్వం వివక్ష

కాళ్ల: పేదల కాలనీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కాళ్ళ, కాళ్లకూరు గ్రామాల్లో సీపీఎం నేతలు సైకిల్ యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో వై.రాము, దూసి కల్యాణి జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతి బాబు, ఇంజేటిశ్రీనివాస్, గొర్ల రామకృష్ణ, మండా సూరిబాబు, ఎం.ఆంజనేయులు, బత్తుల విజయ కుమార్, తిరుమాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం సైకిల్ యాత్ర

ఆకివీడు: పేదల ఇళ్ల స్థల కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్వీ గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లు , ఇళ్ల స్థలాలు, పట్టాలు, కాలనీల్లో కనీస వసతులు కల్పించాలని సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్య సైకిల్ యాత్ర శుక్రవారం మండలంలోని తాళ్లకోడులోని జగనన్న కాలనీకి చేరుకుంది. కాలనీలోని ప్రజలు అత్యధికంగా పాల్గొని హారతులు పట్టారు. కార్యక్రమంలో కె.తవిటినాయుడు, జక్కంశెట్టి సత్యనారాయణ, వై.రాము, బి.కల్యాణి, గొర్ల రామకృష్ణ, మల్లిపూడి ఆంజనేయులు, కె.క్రాంతిబాబు, షేక్ వల్లీ, పెంకి అప్పారావు, దోకల రవితేజ, గేదల ధనుష్, సందక ఉదయ కుమారి, దోకల లక్ష్మి పాల్గొన్నారు.

తాళ్లకోడు జగనన్న కాలనీలో నీటి కొరత

మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని జగనన్న కాలనీలో నీటి కొరత తీవ్రంగా ఉంది. వేసవికి ముందే నీటి ఎద్దడి తీవ్రంగా ఉండటంతో వేసవి కాలంలో తమ పరిస్థితి ఏమిటని కాలనీ వాసులు వాపోతున్నారు. గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పైపుల ద్వారా వాడకం నీటికి ఉపయోగించుకుంటున్నామని, మోటార్లు వేసి తోడినా ఆ పైపుల ద్వారా నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాళ్లకోడు జగనన్న కాలనీకి ప్రత్యేకంగా మంచినీటి చెరువు, పైప్‌లైన్ ఏర్పాటు చేసి, రక్షిత నీటి పథకం నిర్మించాలని ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు.

దళిత ఉద్యోగులు సంఘటితం కావాలి


అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

భీమవరం (ప్రకాశంచౌక్): దళిత ఉద్యోగులు సంఘటితం కావాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.రత్న ప్రదీప్ అన్నారు. భీమవరం బీఆర్ అంబేద్కర్ భవనంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ, భీమవరం మండల కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.రాజ్‌కిషోర్ (తహసీల్దార్), సెక్రటరీగా ఎస్.శ్రీకర్, వైస్ ప్రెసిడెంట్‌గా బి.జ్యోతి, ట్రెజరర్‌గా జి.కృష్ణమోహన్, మండల అధ్యక్షుడిగా వి.రాజేష్‌కుమార్, సెక్రటరీగా కె.గౌతమ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా పి.రాజేష్, ట్రెజరర్‌గా పి.సుధీర్ బాబు ఎన్నికయ్యారు. ముందుగా అంబేద్కర్ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అంబేద్కర్ భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్.రాంబాబు, జి.మురళీకృష్ణ, కె.శ్రీనివాస్‌రావు, కేసీ రాజు, గంటా సుందర్ కుమార్, ఎస్.సలీంరాజు, జె.ఏసుబాబు, ఎం.కాళి, మానస, మహంకాళి, జి.జక్కరయ్య, ఎ.లలిత కుమారి, డి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు గణితంపై ఆసక్తి పెంచుకోవాలి


గణిత మెటీరియల్, క్యాలెండర్లు అందుకున్న విద్యార్థులు


భీమవరం అర్బన్: చిన్నప్పటి నుంచి విద్యార్థులు గణితంపై ఆసక్తి పెంచుకోవాలని గణిత ఉపాధ్యాయుడు రేపాక వెంకన్నబాబు అన్నారు. మండలంలోని అనాకోడేరు డీఎన్నార్ హైస్కూల్‌లో అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయుడు రేపాక వెంకన్నబాబు మాట్లాడుతూ గణితంలో ప్రావీణ్యం సాధిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు పొందొచ్చన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు సూచనలు చేశారు. పదో తరగతి గణితం గ్రాండ్ టెస్ట్‌లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులు పి.ఎలిన్ ఉమార్, ఆర్.మహిమ తేజ, స్వీటీ, జె.మెర్సీ, వై.విజయ మహంకాళమ్మ, ఎం.రూప, జి.సతీష్‌లకు మెటీరియల్, క్యాలెండర్లను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.ప్రేమరాజు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గణితాన్ని ఇష్టంతో చదవాలి


గణిత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: గణితాన్ని ఇష్టపడి చదివితే విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని గణిత ఉపాధ్యాయులు పూడి కోటేశ్వరరావు, రేపాక వెంకన్నబాబు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల వసతి గృహంలో నిర్వహించి కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులను సత్కరించారు. ముందుగా కోటేశ్వరరావు, వెంకన్నబాబు మాట్లాడుతూ గణితమంటే భయపడొద్దని శ్రద్ధగా సాధన చేస్తే పట్టు సాధించొచ్చన్నారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, జె.శకుంతల, చెరుకువాడ రంగసాయి, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

భీమవరం: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కని, ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ ఆపాలని శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు మాట్లాడుతూ ఎన్నో త్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పరిశ్రమలు మూతపడుతుండగా నిరుద్యోగం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని తీవ్రంగా విమర్శించారు. డి.నాగేశ్వరరావు, డి.త్రిమూర్తులు, చిన్న, సూరిబాబు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ వేడుకలు



భీమవరం(ప్రకాశం చౌక్): హోలి నిర్వహిస్తున్న రాజస్థాన్ యువకులు


భీమవరం: బ్యాంక్ కాలనీలో హోలీ వేడుకల చేసుకుంటున్న చిన్నారులు

భీమవరం(ప్రకాశం చౌక్): రంగుల పండగ హోలీని పట్టణంలో వాడవాడలా ఘనంగా నిర్వహిచారు. చిన పెద్ద, మహిళలు,యువత అందరు హోలీ పండగలో పాల్గొన్ని ఒకరికి ఒకరు రంగులు పూసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముఖ్యంగా స్థానికంగా వ్యాపారాలు చేసుకునే రాజస్థాన్‌కు చెందిన యువకులు హోలీ పండగను ఘనంగా నిర్వహించారు.

భీమవరం: పట్టణంలో శుక్రవారం హోలీ పండుగ సందర్భంగా బాలలు, యువత వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచి పలు ప్రాంతాల్లో యువత, బాలలు, మహిళలు ఒకరిపై మరొకరు రంగులు జల్లుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు


శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

వీరవాసరం: కళా పరిషత్ ఆధ్వర్యంలో భీమవరం మిత్ర మెడికేర్ హాస్పిటల్ వారిచే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సాహితీ కళా సేవలతో పాటు పేదలకు వైద్య సేవలు అందించాలనే ఆశయంతో పని చేస్తుందని కళా పరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కర్రా ప్రశాంత్ మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు క్రమశిక్షణతో ఉండాలని రోజు ఎండ తగిలే విధంగా చూడాలన్నారు. ఎముకల స్పెషలిస్ట్ డాక్టర్ కాకులపాటి శ్రీవర్ధన్ మాట్లాడుతూ ఎముకలు గట్టితనానికి పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మద్దాల శివాజీ, గ్రంధి కిషోర్, జడ్డు పెద్దయ్య, గోపా సురేష్, గుండా గోపాలం, గునిశెట్టి ప్రసాద్, గిల్లి సుబ్బారావు, పంజా సాయిబాబు, కళాపరిషత్ సభ్యులు డాక్టర్లను సన్మానించారు. క్యాంప్ మేనేజర్ బి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

భీమవరం: పేదలకు ఇళ్ల నిర్మాణంపై టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేకుంటే దశలవారీగా ఉద్యమాలు ఉద్ధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు హెచ్చరించారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తాడేరు గ్రామంలో ఇళ్లులేని నిరు పేదలతో ఇళ్ల స్థలాలకై వ్యక్తిగత అర్జీలను పూర్తి చేయించారు. ఇళ్ల స్థలాల అర్జీదారులతో ఈ నెల 15వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, దరఖాస్తులను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎం.సీతారాంప్రసాద్, మల్లుల శ్రీనివాసరావు, ఛాన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

భీమవరం: డీఎన్నార్ లా కళాశాలలో శుక్రవారం 35వ వార్షికోత్సవంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఎంతగానో అలరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహారాజు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని వసతులు సమకూర్చుతున్నామని న్యాయ విద్యనభ్యసించిన విద్యార్థులు పేదలకు న్యాయ సహాయం అందించాలన్నారు. అనంతరం పలు విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నర్సింహారాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లా కళాశాల కోఆర్డినేటర్ ఎంవీ కృష్ణంరాజు, జాయింట్ సెక్రటరీ కె.రామకృష్ణరాజు, చిరుకూరు కుమార దత్తాత్రేయ వర్మ, ఏఓ పి.రామకృష్ణంరాజు, ప్రిన్సిపల్ కె.రఘురాం, వైస్ ప్రిన్సిపల్ అశోక్ కుమార్, చెల్లబోయిన రంగారావు పాల్గొన్నారు.